
# నీ భాషలోనే సమాధానం చెప్తా!



డాక్టర్ సి. ఆనందారామం

ఆ రోజు పున్నమి రాత్రి పదకొండు గంటల సమయం అంత రాత్రివేళ కాస్త సందడిగా ఉండే ప్రదేశం ఒకటుంది. అది టాంక్‌బాంక్- రకరకాల జంటలు- భార్య భర్తలైన వాళ్లు- కాబోతున్నవాళ్లు- వొట్టి స్నేహితులు- అక్కడి బెంచెస్ మీద కూచుని, అతి నెమ్మదిగా జోక్స్ వేసుకుంటూ కిగ్గురగా నవ్వుతుంటే వాళ్ళంతా వెన్నెల కెరటాలలో పుష్యాలలా తువ్వళ్లుగా ఉంది. జంటలో కని అక్షర ద్వాయిలా కొందరు ఊరికే అక్కడ ఇక్కడ తిరుగుతూ కాస్త షోగ్గాలాగ కనిపించే అమ్మాయిలని కావాలని రాసుకు పోతున్నారు. ఆ అమ్మాయిల బాయ్‌ఫ్రెండ్స్ కి ఆల్లరిబ్బాయిలకి పోట్లాటకి దిగుతున్నారు. వీళ్ళలో కొందరు మందు కొట్టినవాళ్లు ఉన్నారు.

పవన్‌కి ఈ సందడంతా చూడడం చాలా ఇష్టం అంచేతనే ఎప్పటిలా తన కారుని అతి నెమ్మదిగా పోనిస్తున్నాడు.

అంతలో ఒక అమ్మాయి కారుకి అడ్డుగా నిలబడి ఆపమన్నట్లు చేయి ఊపింది.

పవన్ సాధారణంగా ఇలాంటి వాళ్ళ బుట్టలో పడడు. ఏ అమ్మాయి కి పడితే ఆ అమ్మాయికి కారులో తన పక్కన సీట్ ఇచ్చే తెలివి తక్కువతనం అతనిలో లేదు. కానీ, ఆ అమ్మాయి కట్టుకున్న సాటిన్ షిఫాన్ చీర. వెన్నెల్లో చెవులకు మెరుస్తున్న దుద్దులు, అన్నింటి కంటె చక్కటి పోషణలో పెరిగినట్లు చెప్పక చెపుతోన్న ఆమె శరీరలావణ్యమూ, వీటిని బట్టి ఆ అమ్మాయి మామూలు లేకి మనిషి కాదనే నిర్ణయానికి వచ్చాడు, అయినా ఫర్వా లేదనుకుని కారు ఆపాడు.

విండోలోంచి తల బయటకు పెట్టి "యస్?" అన్నాడు ఆ అమ్మాయి అందానికి ఆశ్చర్యపోతూ ఆ కళ్లు పద్మపత్రాలు కావు- చాలా చిన్నవి. కానీ ఇంద్రనీలల్లా మెరుస్తున్నాయి.

కొంచెం పొట్టి ముక్కు- ఛాయ మాత్రం మేలిమి బంగారు పసిడివర్ణం. అకారణాన పెదవులూ కెంపుల్లా వున్నాయి. వంపు తిరిగి....

ఆ ఆకర్షణ ఏ అవయవంలో ఉందో తేల్చి చెప్పడం కష్టం. మొత్తం మీద ఏదో పొందికతనం! మహారాణుల కుంచేలాంటి ఠీవి! అంతటి ఠీవిలోనూ సన్నజాజుల సౌకుమార్యం....

"మాట్లాడరేమండీ?"

ఆ అమ్మాయి విసుగ్గా అడిగింది. అప్పుడు అర్థమయింది అతడికి. ఆమె ఏదో మాట్లాడుతుందనీ.... తాను వినిపించుకోలేదనీ....

"క్షమించండి- ఏదో ఆలోచిస్తున్నాను. ఏమన్నారూ?"

ఆమె కనుబొమ్మలు చిట్లించింది. కానీ వాటి కింది కనుపాపలు మాత్రం నవ్వుతున్నట్లు అతనికి తోచింది లేక, 'ఆ కళ్లు ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉంటాయా'!

"నేను వస్తున్న ఆటో ఫెయిల్ అయింది. దయచేసి కింగ్స్‌వేలో మా ఇంటికి లిఫ్ట్ ఇస్తారా! ఈ సమయంలో ఆటోలు కానీ. టాక్సీలు కానీ దొరకవు. ఇక్కడ అన్నలు దొరకవు."

ఆమె మాటలకు సాక్ష్యం అన్నట్లు కొద్ది దూరంలో ఆటో కనిపించింది. ఆటో డ్రైవర్ మిషన్ ఓపెన్ చేసి స్క్రూడ్రైవర్‌తో ఏదో రిపేరు చేస్తున్నాడు.

"ఈ సమయంలో ఒంటరిగా ఆటోలో ఎక్కడి నుంచి వస్తున్నారు?"

"మీరు నాకు లిఫ్ట్ ఇయ్యాలంటే! ఈ ప్రశ్నకు సమాధానం చెప్పితీరాలి?"

కొద్దిపాటి తీక్షణత ఆమెగొంతులో....

ఇదేమిటి? లిఫ్ట్ అడుగుతున్న మనిషి అనునయంలో మాట్లాడాలి కానీ....

కానీ, ఆమెకి "నో" అనగలిగే శక్తి తనకి లేదని అతనికి అప్పుడే తెలిసిపోయింది.

"రండి" అన్నాడు ఫ్రంట్ డోర్ తెరిచి ఆమె నిస్సంకోచంగా వచ్చి పక్కన కూచుంది.

అప్పటివరకు పాడయిన ఆటో అప్పుడే స్టార్టు కావటం అతడు గమనించలేదు.

"మీ పేరు?" అన్నాడు కారు కొంత దూరం పోయాక

"సమీర!"

"ఆశ్చర్యంగా ఉందే!"

"ఏమిటి ఆశ్చర్యం?"

"మన పేర్లు ఇంచుమించు ఒకటి కావటం - నా పేరు పవన్‌కుమార్"

ఆమె నవ్వింది.

వెన్నెలలు కారులోకి దూసుకొచ్చాయి. చుక్కలు అసూయతో తొంగి తొంగి చూసాయి. మబ్బులు విలాసంగా వొళ్లు విరుచుకుని తెలుపునలుపుల్లో కలగలుపు తున్నాయి.

కారు నడుస్తోంది. అతి నెమ్మదిగా.

కాలం మాత్రం ఏదో లెక్కచెయ్యకుండా యధావిధిగా పరుగులు తీస్తోంది.

ఏదో మిల్లుసైరన్ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ బయ్ మని అరిచింది.

ఆమె చిరాగ్గా చెవులు మూసుకుంది.

"గోల కదూ!" అన్నాడు అతడు

"అది కాదు - అపస్వరాలు నేను భరించలేను-"

"మిల్లు సైరన్‌లో కూడా స్వరమాధుర్యం ఉంటుందా?"

"సృష్టిలోని ప్రతి స్వరంలోనూ ఏదో శృతి ఉంటుంది. అప్పుడప్పుడు అపస్వరాలు వినిపిస్తాయి. మిల్లు సైరన్ అలాంటిదే కాబోలు! బహుశః ఆ మిల్ లోనే ఏదో అపస్వరం ఉందేమో!...."

ఆ మాటల వెనక లీలగా ఏవో అర్థాలు తోచాయి- అతడు మూర్ఖుడు కాడు- అయితే ఈ అమ్మాయి బాగా ఆలోచించి మాట్లాడుతోందా? అమాయకంగా ఏదో అంటోందా?!



"ఏం చదువుతున్నారు?"

"ఇక్కడ వర్కు ట్రైనింగుకి వచ్చాను"

పొంగుతున్న అతని మనసుచటుక్కున కుంచించుకు పోయింది. ఇంతా చేసి వర్కు మాత్రమేనా?

ఆమె డైరక్షన్ ప్రకారం ఒక ఫ్లాట్ ముందు ఆపాడు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంది అది.

"థేంక్యూ!" అంటూ దిగింది. అతడు వెంటనే కారు స్టార్ట్ చెయ్యలేదు.

"కాసేపు మా ఇంటికి వచ్చి కూర్చుంటారా?"

"ఇంట్లో వాళ్లు ఏమైనా అనుకోరూ?"

"అనుకోవటానికి ఇంట్లో ఎవరూలేరు. నేనొక దాన్నే ఒక గదిలో ఉంటున్నాను. మిగిలిన భాగంలో ఇంటి వాళ్లు ఉంటున్నారు."

అతడు కారు దిగి ఆమెతో గదిలోకి వచ్చాడు. చాలా నీట్‌గా ఉంది. స్టాండ్ మీద చీరలన్నీ అరేంజ్ చేసివున్నవి. డ్రెసింగ్ టేబిల్ మీద అలంకరణ సామాగ్రి కూడా ఖరీదైనదే.

"ఇప్పుడే వస్తాను" అని పక్కవాటాలోకి వెళ్ళి కాఫీ కప్పులతో వచ్చింది.

"ఇంటి వాళ్లు మంచి వాళ్లు." నన్ను సొంతమనిషిలా చూసుకుంటారు."

అడక్కుండానే చెప్పింది....

ఆసమయంలో కాఫీ తాగడం అతని కలవాటు లేదు. ఇష్టమూ లేదు. అయినా మరి కాసేపు కూర్చోవటం కోసం తాగాడు. ఎంత నెమ్మదిగా సిప్ చేసినా కప్పు ఖాళీ అయిపోయింది.

"వస్తాను." అని లేచాడు.

బయటికొస్తున్నప్పుడు చూశాడు. గుమ్మంలో నిలబడ్డ యువకుడిని. ఇంటి వాళ్ళ అబ్బాయిని. కొంపతీసి ఇతడు ఒంటరిగానే ఉంటున్నాడా? ఒకవేళ ఉంటే. అందులో తన కొంపతీసిందేముంది? ఆహా, ఈ మనసు....

మర్నాడు అతడు టాంక్‌బండ్ అంతా వెతికాడు కళ్ళలో. ఆ అమ్మాయి కనబడలేదు. సాహసించి ఇంటికి వెళ్లాడు. తలుపులు వేసివున్నాయి. తట్టాడు. ఆధునికంగా వున్నా ఆ తలుపులలోపల నుంచి వేసారో బయటి నుంచి వేసారో తెలుసుకోవడం కష్టం.

ఆ శబ్దం విని ఆ అమ్మాయి ఇంటి వారి వాటాలోంచి వచ్చింది.

ఇంత రాత్రివేళ ఇంటివారి వాటాలోంచి ఆ యువకుడు. "మీరా," అంది ఆనందం ఆ అమ్మాయి గొంతులో. తలుపు తెరిచి ఆహ్వానించింది.

చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు. అతని మనసులో కోరికలు వందడి చేస్తున్నాయి. కానీ బయట పెట్టె సాహసం కలగలేదు. ఏదో అభిమానంతో మాట్లాడుతున్నా తనదరి దాపుల ఎదుటి వాళ్ళని రానియ్యని గాంభీర్యపు రేఖ వుంది ఆమె నావరించుకుని. అతడు ఎదుటి వ్యక్తుల్ని అంచనా వేయటంలో మంచి దిట్ట....

స్నేహం పెరుగులోంచి. అతడి ఆఫీసు విశేషాలు ఆమె, ఆమె ఆస్పత్రి విశేషాలు అతనూ తెలుసుకొనేవారు. అప్పుడప్పుడు కలిసి సినిమాలకు వెళ్లేవారు. వొక్కోసారి సినిమాలో భుజం చుట్టూ చెయ్యి వెయ్యబోతే, ఆ చేతిని తీసేసి అతని ముఖంలోకి గంభీరంగా చూసింది. తన క్రింద వుద్యోగస్థులను గడ గడ లాడించే అతను, ఆ చూపులకు మంచు బొమ్మ లా అయిపోయాడు. ఎదుటి వ్యక్తుల్ని ఇలా చూపుల్తో శాసించే లక్షణం పెద్దింటి పిల్లలకి వుంటుంది. నైతిక బలం వున్నవాళ్ళకి కూడా వుంటుందేమో. కానీ, ఇంటివాళ్ల అబ్బాయి....?

ఆ రోజు....

సినిమాల్లో లాగా వానా అదీ రాలేదు. కానీ, అతని మనసులో గాలి వాన చెలరేగే వార్త చెప్పింది.

ఆ అమ్మాయి....

"నేను రేపు వెళ్లిపోతున్నాను".

కొన్ని క్షణాలు అతని నోట మాట రాలేదు.

తెప్పరిల్లి అన్నాడు, కొంచెం బెంగగా.

"అదేం? మీ ట్రైనింగ్ అయిపోయిందా?"

"అయినట్లే."

ఈ మాటలంటూ ఆమె అంతకు ముందెన్నడూ చూడని విధంగా కొంచెం విలాసంగా చూసింది. అంతేకాదు. మనసులో ఏభావాలు కదలాడాయో కానీ, బుగ్గలు ఎఱ్ఱబడి పోయాయి.

అంత మాత్రం చాలు అతనికి. కానీ, మరి కాస్త చూద్దామనుకున్నాడు.

"అయ్ మిస్ యూ ...." అన్నాడు బాధగా.

"నేను కూడా...." ఆ అమ్మాయి ముఖంలో బాధలేదు. చిలిపి చిరునవ్వు వుంది.

ఇంక ఆలస్యం చెయ్యకూడదనుకున్నాడు. దగ్గిరగా వచ్చి చేతుల్లోకి తీసుకోబోయాడు. బెదిరి వొక్క అడుగు వెనక్కు వేసింది. "వద్దు" అంది కంగారుగా.

ఆమె తీవ్రంగా ప్రతిఘటించక పోవటం అతనికి బలాన్నిచ్చింది.

"ప్లీజ్" అంది. ఆమెని చేతుల్లోకి తీసుకుని ముద్దు కూడా పెట్టుకున్నాడు. ఆమె విడిపించుకోవటాని ప్రయత్నం చేస్తూనే చివరికి ఓడిపోయింది. ఏ కారణం వల్లనో తీవ్రంగా ప్రతిఘటించ లేక పోయింది. తన అదృష్టాన్ని అభినందించుకున్నాడు అతడు.

అంతా అయిపోయాక ఆమె ఏడ్వలేదు. సిగ్గుపడుతూ లోపలికి పోయి బట్టలు మార్చుకుని వచ్చింది.

అతనికి ఆశ్చర్యం కలిగింది. ఎంతో రిలీఫ్'గా కూడా ఫీలయ్యాడు. ఏ గొడవా లేకుండా తేలిపోయినందుకు....

"నేను వెళ్తాను." అన్నాడు....

"మీరు నన్నెప్పుడు పెళ్ళిచేసుకుంటారు?"

సూటిగా అడిగింది ఆ అమ్మాయి. ...

"పెళ్ళా? ఇలాంటి సంబంధాలన్నీ పెళ్ళిగా మారతాయని ఎవరు చెప్పారు మీకు?"

తెల్లబోయి చూసింది....

"అయితే, నన్ను పెళ్ళి చేసుకునే వుద్దేశం లేదా మీకు? నామీద ఎలాంటి మమకారం లేకుండానే ఇదంతా జరిగిందా?"

నవ్వాడు అతడు....

"ఈ లోకంలో స్నేహం, మమత, ప్రేమ, ఇంకేమీ లేవు. నాకు సంబంధించినంత వరకూ.... వున్నదొక్కటే! అది వ్యవహారం. లాభనష్టాలు చూసుకోకుండా నేనేపనీ చెయ్యను. మా బాస్ కూతుర్ని నేను పెళ్ళి చేసుకో బోతున్నాను. ఆడవాళ్లూ, మొగవాళ్లు పరస్పరం ఇష్టపడి కలుసుకోవటం అతిమామూలు విషయం. దీన్ని నువ్వు సీరియస్‌గా తీసుకోనక్కర్లేదు మరిచిపో!"

చిత్తరపోయి చూసింది. ఆ చూపులు.. అందమయిన పువ్వును కోయటానికి వెళ్తే అక్కడ విషసర్పం బుసలుకొడుతూ కనిపిస్తే, ఒక పసిపిల్ల చిత్తరపోయి ఎలా చూస్తుందో. అలా వున్నాయి.

ఆ ముఖం చూడలేకపోయాడు. అక్కడి నుంచి వెళ్ళిపోలేకపోయాడు. ఆ రోజే ఆ అమ్మాయిని తుడిచేశాడు, తన మనసులోంచి! ఆమె అందమయినదే! కానీ, ఆ అమ్మాయిని మళ్ళీ చూస్తానని అతడనుకోలేదు. అందులోనూ అలాంటి సన్నివేశంలో.... అతడిబాస్ ఇంటికి పార్టీకి ఆహ్వానించాడు. ఆ ఆహ్వానంలో అంతరార్థాన్ని గ్రహించి, చాలా శ్రద్ధగా తయారయి, ఫారిన్ స్ప్రే స్ప్రింకిల్ చేసుకుని వెళ్లాడు.

అక్కడ కనిపించింది ఆ అమ్మాయి.

చిరునవ్వుతో "రండి" అంది....

ముందు తెల్లబోయాడు.

బాస్ వచ్చి "మీట్ మై డాటర్, సమీర" అనేసరికి స్థాణువయి పోయాడు.

"అమ్మాయి మీతో మాట్లాడతానంది. మాట్లాడుకోండి!" అని వెళ్ళిపోయారాయన....

అతడికి గొంతు తడారిపోసాగింది.

ఆమె నవ్వింది. అతడికి ఊపిరి తిరిగింది.

తల వొంచాడు. ఆమె కనుబొమ్మలు బిగించింది. అతడు ముడుచుకుపోయాడు. ఆమె మాటలు మొదలుపెట్టింది....

"నాన్నగారితో మీతో మాట్లాడతానని ఎందుకు చెప్పానో తెలుసా?"

"బహుశః పరస్పరం ఒకరిగురించి ఒకరం తెలుసుకోవటానికి!"

గంభీరంగా, దర్జాగా వుండటానికి ప్రయాస పడుతున్నాడతడు....

"ఇంకా మిమ్మల్ని గురించి నేను తెలుసుకోవలసిందేముంది" అన్నది

"నేను మీకు గుర్తున్నానా?"

"ఎప్పుడు మరచిపోతాను గనుక!"

ఇంతకు పూర్వం ఏమో కానీ, ఇక ముందు మాత్రం మరిచిపోలేరు లెండి!"

"ఎలా సాధ్యమవుతుంది?"

"ఎందుకని అంటున్నారు?"

ఆ అమ్మాయి దోరతనానికి భయం వేసింది, అతడికి.

"మీరే చెప్పండి!"

"నాలాంటి వ్యక్తులు మళ్ళీ మీకు జీవితంలో తారసపడరు కనుక? నా పరిచయం మీకు జీవితంలో ఏ నాటికీ మరిచిపోలేని మలుపు కాబోతోంది కనుక!"

"అంటే?"

"ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగులని బర్తరఫ్ చెయ్యటానికి కారణాలు సృష్టించుకోవటం అంత కష్టం కాదు- అవునా?"

అతడికి చెమటలు పట్టాయి....

"మీరు ఆపని చెయ్యబోతున్నారా?"

"చెయ్యబోతున్నారా?- కాదు- చేసేసాను- మీకు బర్తరఫ్ ఆర్డర్స్ రావటానికి కొన్ని రోజులు పట్టొచ్చు-"

పరిస్థితి చెయ్యిదాటి పోయిందని అర్థమయింది అతనికి. మొండి ధైర్యం వచ్చింది,

"జరిగినది గుర్తుచేసుకోండి. నీ శీలం ఎలాగు పాడయింది, ఆ సమయంలో నేనన్న మాటలు మరిచిపోయి నన్ను పెళ్ళి చేసుకోవడం ఇద్దరికీ మంచిది.

ఆ అమ్మాయి కళ్ళు భగ్గున మండాయి మొదట. కొంత ప్రయత్నం మీద కూడదీసుకుని నిరసనగా నవ్వింది.

"మీ భాషలోనే సమాధానం చెప్తాను. ఆడవాళ్ళూ మొగవాళ్లు ఇష్టపడి కలుసుకోవటం మామూలు విషయం. దానికి ప్రాధాన్యం ఇయ్యక్కర్లేదు. ఒక్కప్పుడు జీవితాన్ని కథగా ఆడుకోబోయాను, నేడు జీవితం ఎదురయింది.

"అంటే?...."

"మీరు నన్ను చూడలేదు.... కానీ, నేనుమిమ్మల్ని చాలాసార్లు చూసాను-నాన్నగారి కోసం ఇంటికి వచ్చినప్పుడు....కథలు చదివి చదివి మతి పోగొట్టుకున్న నేను మిమ్మల్ని ప్రేమించాననుకున్నాను. నా కోరిక మీదనే నాన్నగారు నా పెళ్ళి మీతో జరిపించాలనుకున్నారు.

ఈలోగా కథల్లోలాగ నన్ను నా డబ్బు కోసం ప్రేమిస్తున్నారో, నాకోసం ప్రేమిస్తున్నారో తెలుసుకోవాలని చిన్న నాటకం ఆడాను. మొత్తం జీవితం అర్థమయిపోయింది. ఆ రోజు మీకు లొంగిపోవటం నాకు ఇష్టం లేదు, కానీ, మీరు నా భర్త కాబోతున్నారనే భావమూ, మన పెళ్ళికి ఆటంకాలేవీ లేవనే ధైర్యమూ నానని కంగారు పెట్టి నన్ను బలహీనురాలిని చేసాయి."

"ఈ రకంగా కథలోకి జీవితం వచ్చేసింది, ఇప్పుడు పరమ దుర్మార్గుడు రేప్ చేసినా, అతడినే భర్తగా అంగీకరించే కథానాయికలాగ, మిమ్మల్ని పెళ్ళి చేసుకుని జీవితాన్ని కథగా మార్చుకొను.

జరిగింది తెలుసుకుని సన్మార్గం చేసుకోగలిగిన వాడిని పెళ్ళి చేసుకుంటాను...."

"ఎవరినీ! ఆఇంటి వారి అబ్బాయినా?"

ఉడుకుమోతుతనంతో రగిలి పోతూ అన్నాడు. "షటప్!"

పక్కగదిలోనుంచి దూసుకొచ్చింది ఆరుపు - ఆ తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా నిలబడ్డాడు నిప్పులు కురిపిస్తూ ఆ యువకుడు: ఇంటి వారబ్బాయి! "నేనెవరో తెలుసా? సమీర అన్నని! దాని పోరు పడ లేక దాని పిచ్చినాటకంలో నేను వేషం వేశాను.

ఆ రోజు మాత్రమే నేను లేను ఆ ఇంట్లో! పోనీలే! అంతా మంచికే జరిగింది ఇంక బయటికి నడు?"

అతడికి తల తిరిగింది. అప్పటివరకు అతడు ఎందరినో నిర్లక్ష్యం చేసాడు. నిర్లక్ష్యం చేయబడటం ఎంత బాధాకరంగా ఉంటుందో మొదటి సారిగా తెలిసింది.

తలవంచుకుని బయటికి నడిచాడు.

అతడొక్కసారి వెనక్కు తిరిగి ఉంటే ఆమె కళ్ళలోని నీటి మబ్బులను చూడగలిగేవాడు, వాటి వెనక ప్రణయ సౌదామినుల మెరుపును గుర్తించేవాడు.

స్త్రీ ఎలాంటి పరిస్థితులలోనయినా శిలా విగ్రహం కాలేదనీ, కేవలం మంచు బొమ్మేననీ, అందుకే మగవాడి ఆటలు సాగుతున్నాయనీ అర్థంచేసుకోగలిగేవాడు.

కానీ, అతడు వెనక్కు తిరిగి చూడలేదు. అందుకు ముఖం చెల్లలేదు.

ఒక్క స్నేహపూర్వకమయిన మాట కోసం.... ఒక చల్లని మమతా పూరిత స్పర్శకోసం ఆ క్షణంలో అతడి మనసు పరితపించింది.

కానీ లోకంలో స్నేహం, మమత లేవు - అతని అభిప్రాయం ప్రకారం ☆

